# అపశృతులు

అమ్మ నాపదో ఏటే చనిపోయింది! నాన్న దిగులుతో మంచంపట్టి లేవలేని పరిస్థితి! అన్ని పన్లూ నానెత్తిన పడినయ్. ఒకవైపు స్కూలుకెళ్లాలి! చదువు! మరోవైపు ఇంట్లో వంటపెట్టు, గొడుగోద వున్న ఇల్లాయె! వాటికి కుడితి పెట్టను.. గడ్డి వెయ్యను... పాలుపితకటం... గోడ్ల సావిడి శుభ్రం చేసుకోవటం లాంటి పన్లు తప్పించుకోలేనివి ఇతరులు చేత చేయించుకోలేనివి!

పాలు కావలసిన వారంతా మా ఇంటి కొచ్చే పాలు పోయించుకుంటూ వుంటారు. ఇళ్ల వెంట తిరిగిపాలు పోసే తీరికనాకెక్కడిది?

పనులకు... చదువుకు పొంతన కుదరకుండా వుంది! బడిలో వెనకబడి పోతానేమోనే దిగులు!

పక్షవాతంతో మంచంలో వున్న తండ్రికి కాలు... చెయ్యితో పాటు నోరూపడిపోయింది! వైద్యం చేయించి నా ప్రయోజనం లేకుండా పోయింది. ఆయన చేసే సైగలను అర్థం చేసుకుని ఆయనకేం కావాలో టైమ్ ప్రకారం సమకూర్చాలి! నేను స్కూలుకెళ్లేక అన్నింటికీ నాన్నకు యతనే!... తన నిస్సహాయ స్థితికి కళ్లనీళ్లు పెట్టుకుంటుంటే నా మనసుకు బాధన్పిస్తుంది. పోనీ బడి మానేద్దామా అంటే చదువుతోంది టెన్త్! కనీసం టెన్త్ అయినా పాసవాలని కోరిక!

అమ్మ చనిపోయి నాన్న మంచాన పడ్డప్పుడు బంధువులనే వారెవరూ ఇంటికొచ్చి చూచి ఓదార్చిన పాపానపోలేదు. నేను పుట్టి బుద్ధి ఎరిగిన నాటి నుంచి మాకు చుట్టాలున్నారనే విషయమ నేనెరగను. అమ్మ నాన్న ఫలానావారున్నారనీ చెప్పలేదు.

తల్లిపోయినపుడు కన్న తండ్రే కొరివిపెట్టాల్సి వచ్చింది. రేపు తండ్రి కాలం చేస్తే... ఆడపిల్లనైనా నేను కొరివిపెట్టక తప్పదనే విషయం గుర్తు కొచ్చిప్పుడల్లా నాగుండె చెరువౌతుంది!

చిన్నదాన్ని కాబట్టి... నేనున్నా లేనట్టే! ఆడ దిక్కులేని సంసారం కిందే లెఖ! బాధపడి ప్రయోజనం వుండదన్పించటంతో మనసురాయి చేసుకుని అటు చదువు ఇటు పన్లన్నిటినీ చక్క దిద్దుకురాక తప్పటం లేదు.

కష్టమో... నిష్ఠూరమో... మొత్తానికి టెన్త్ ఎగ్జామ్స్ బాగానే తృప్తి మేరకు రాశాననిపించింది.

టెన్త్ రిజల్ట్సు వచ్చినయ్! నాకు స్టేట్ ర్యాంక్ వచ్చిందనే సంతోషం మిగలకుండాపోయింది. అదే రోజు నాన్న అకస్మాత్తుగా కన్ను మూయటంతో నేను ఒంటరి దాన్ని అయ్యాననే బాధ.. వేదన నన్ను కలవరపరిచి కలచివేసింది.

తండ్రి మరణం నాఎడల అశనిపాతమైంది. ఒకటే దుఃఖం... ఏం చేయాలో తోచని పరిస్థితి! ఇరుగుపొరుగు పొగై నన్ను ఓదార్చే ప్రయత్నం చేశారు. తండ్రి చితికి నిప్పుపెడుతున్న క్షణంలో నా హృదయం బద్దలైంది.

రెండు మూడు రోజుల పాటు తిండి సయించలేదు. పక్కవాటాలో ఆంటీ నాచేత బలవంతాన పాలు తాగించారు. నాకు ధైర్యాన్ని నూరిపోసింది.

తోడబుట్టిన వాళ్లెవరూ లేకపోవటం ఎంత బాధాకరమో నాకు అర్థమైంది. ఒకవైపు ఒంటరితనం... దిగులు కృంగతీస్తున్నా... పొలానికెళ్లి పచ్చిగడ్డి కోసుకురావటం.... కొట్లో గొడ్ల కోసం చిట్టు తవుడు తేవటం తప్పనిసరైంది. ఒక్క గేదెను వుంచేసుకుని మిగతా వాటిని అమ్మేశాను.

అమ్మేసిన గొడ్లు ఇల్లు విడిచి వదిలి వెళ్లలేని బాధ అయిష్టత వాటి కళ్లల్లో ప్రస్ఫుటంగ చూడగలిగాను. వాటితో నాకు గల ఆత్మీయతానుబంధాలు తెగిపోయి అవి నాకు దూరంగ వెళ్లిపోతున్న క్షణాన నా హృదయం ఆవేదనకు గురైంది.

ఇక నాకు చదువు ముగిసినట్టే! కాలేజీలో చేరమని ఫ్రండ్స్ బలవంతం చేసినా నాకెందుకో ఇకపై చదవాలనిపించలేదు. నా చదువు ఇంకా ఎవరికోసం?- తల్లి తండ్రులిచ్చిన ఇల్లుంది... నగలు డబ్బువున్నయ్... పదెకరాల పొలముంది. నా జీవితం సాఫీగ సజావుగ సాగిపోవటానికి కన్నవారు నా పరం చేసి కన్ను మూసినా నా భవిష్యత్‌కెలాంటి భయంలేదు! ఇంట్లో అన్నిటికీ నాకు నేను పెద్ద! ఏవిషయంలో నైనా ఎలాంటి నిర్ణయమైనా తీసుకోవలసింది నేనే!

పక్కవాటాలో ఆంటీ నన్ను కనిపెట్టి వుంటోంది. ఆమే నాకు తోడు నీడ ఆసరా! నాలో గల ఒంటరి తనాన్ని దూరం చేస్తూ తన అనుభవాలను జోడించి చెప్తూ ధైర్యాన్ని నూరిపోస్తోంది.

ఉన్న ఒక్క గేదె... పాలు ఇవ్వటం లేదు... దాణా తినటం లేదు... కుడితి

తాగటం లేదు. ఆంటీని తోడు తీసుకుని పశువుల ఆస్పత్రికి తోలుకెళ్లాను.

వైద్యులు పరీక్ష చేసి... గొడ్డు కడుపులో ప్లాస్టిక్ మెటీరియల్ వుందని... అకారణంగానే మేత మెయ్యటం లేదని... పాలు ఇవ్వటం లేదనీ చెప్పినపుడు ప్లాస్టిక్ మెటీరియల్ వుండటమేమిటని ప్రశ్నించాను.

మేపుకు రావటానికి పంపినపుడు దోవలో రోడ్లపై వుండే ప్లాస్టిక్ కవర్లు తినేసి వుంటుంది. ఆపరేషన్ చేసి కడుపులో గల ప్లాస్టిక్ వుండలను తియ్యకపోతే గేదె చనిపోగల అవకాశం వుందని డాక్టర్ చెప్పగా.. వెంటనే అందుకు ఏర్పాటు చెయ్యమంటూ బ్రతిమిలాడాను కనీసం దీన్నయినా బ్రతికించు కోవాలనే ఆపేక్షతో!

× × × × ×

మా నాన్నకు వడ్డీ వ్యాపారం కూడా వుండేది. అడిగినవారికి లేదనకుండా తక్కువ వడ్డీకి అప్పులిస్తూండటం నాకు తెల్సు! కొందరి చేత పెద్ద మొత్తాలు అప్పుగా ఇచ్చినపుడు ప్రాంసరీ నోటు రాయించుకునే వాడు. చాలామందికి నోటి మాటతో ఇస్తూండేవాడు. అప్పు తీసుకున్న వాళ్లెవరూ ఎగేసిన దాఖలాల్లేవు.

నాన్న పోయాక కూడా చాలా మంది అసలు వడ్డీ కలిపి నా చేతికి ఇచ్చారు. మంచి చెడు అన్నింటి గురించి నాకు వూహ తెల్సిన నాటినుండి నాన్న నాతో చెప్తూండేవాడు.

నా పెళ్లికి దిగులు పడాల్సిన అవసరం లేదని... బోలెడంత ఆస్థి వుందని... ఆకాశమంత పందిరేసి మూడురోజుల పెళ్లి ఘనంగా జరిపిస్తానని అంటూంటే నాన్న మాటలకు మురిసే దాన్ని.

ఇప్పుడిక నా పెళ్లికి పెద్దల్లేరు కనుక తగిన వరుడుని నేనే వెతుక్కోవాలి కాబోలు అనేసి మనసుకు నచ్చ చెప్పుకోవలసి వస్తోంది.

ప్రేమ వివాహాల మీద నాకు సదభిప్రాయం లేదు. నేను డబ్బుగల దాన్ని కాబట్టి... నన్ను కట్టుకుంటే సుఖపడచ్చని ఆవచ్చే... అదే తాళి కట్టబోయే ఘనుడు కలలు కనచ్చు! డబ్బుతో అన్నీ అవస్థలే!

తలవని తలంపుగ ఒకరోజు మా ఇంటికి ఇద్దరు నడివయసు మగాళ్లు... ఇద్దరు ఆడవారు... నలుగురు వృద్ధ వనితలు రావటం చూచి నాకు ఆశ్చర్యం వేసింది.

వీరంతా ఎవరైవుంటారో నావూహకి అందలేదు. వీరినెప్పుడూ చూచిన గుర్తు రావటం లేదు. తెల్ల ముఖం వేసుకుని ఆ వచ్చిన వారికేసి ఎగదిగా చూస్తూ నోరెళ్ల బెట్టాను.

'అట్టా సుత్తావేంది చిట్టెమ్మా?.. మేం నీ బంధువులం! మమ్మల్ని నువ్ ఎరగవులే? నువ్వు పసిదానివిగా వున్నప్పుడు ఒకే ఒక్కసారి వచ్చాం!... ఇదిగో మళ్లీ ఇప్పుడే రావటం...' ఓ ముసలావిడ కళ్లు చేతులు తిప్పుతూ అంది.

'బంధువులంటే....'

'ఓసి పిచ్చిమాలోకమా.. అంటే సుట్టాలమన్న మాట!

'మా వాళ్లంటూ మాకెవరూ లేరే...'

'నీ ముఖం నీకెం ఎరిక?- నీ అమ్మ అయ్యాపోయినపుడు రాలేకపోయాం. పొలం పన్లతో తీరికలేక రాలేకపోయాం... నిన్ను చూచిపోదామని ఇదిగో ఇప్పుడొచ్చినాం.'

'అట్టనా?.. మీరంతా దోడ్లో నూతికాడ తానాలు ఆడిరండి.. ఈలోగా అందరికి వంట చేసేస్తాను.. అవునూ మీరు నాకేమౌతారు'

'ఇదిగో ఈడు నీకుచిన్నాయన! ఆయన వేలు విడిచిన మేనమామ కొడుకు. వరసకు బావ అవుతాడు. వయసు మీద పడ్డా వాడికింకా పెళ్ళి కాలేదు. నీలాంటి చక్కని చుక్క దొరికితే తాళ్లి గట్టటానికి సిద్ధంగా వున్నాడు!... వీళ్లిద్దరూ.. నీకు పిన్నమ్మలవుతారు వరుసకి!- ముసలోళ్లం మేము నలుగురం అవ్వలం!... అర్థమైందా?...'

'అట్టనా... ఇంతమంది బందుగులున్నారన్న మాట నాకు?- ఎంత సంబరంగా వుందో... ఉండండి కాచిన పాలు తెస్తాను. మీరంతా తాగుదురు గాని...' వంట గదిలోకి వెళ్లాను.

× × × × ×

చిట్టెమ్మా!... మీ ఇంటి కొచ్చిందెవరే?-' పక్కింటి ఆంటీ అడిగింది.

'మా చుట్టాలంట?'

'నీ ముఖం! నాకు తెలియని చుట్టాలెవరో? అసలు నీకు చుట్టాలే లేరు...'

'మరి... వచ్చిన వారంతా ఎవరు?-'

'వీలైనన్ని రోజులుండి తినిపోదామని వచ్చినోళ్లు ఆళ్లను నువ్వు నమ్మాబాక! కాస్తంత జాగ్రత్తగా వుండు!... నగనట్రా... డబ్బూ దస్కం వాళ్లకు అందనీయద్దు... తర్వాత వాళ్ల సంగతినే చూస్తాను...' జాగర్తలు చెప్పి ఆంటీ మళ్లీ వాళ్ల వాటాలో కెళ్లి పోయింది.

ఆరోజు రాత్రి భోజనాలైన తర్వాత 'చిట్టెమ్మా!... మీ అయ్యా బోలెడంత ఆస్తి... బంగారం... ఈఇల్లు... క్యాషు అంతా నీపరం చేసి పోయాడు గదా... నువ్వు ఒక్క దానివి అన్ని వ్యవహారాలు చక్కదిద్దుకోగలవాలని?-' పిన తండ్రి అనబడే ఆయన ఆరాతీయసాగాడు.

'నాకా విషయాలేమీ తెలియవు... నువ్వనుకుంటున్నట్టు ఆస్తి డబ్బు బంగారం ఏమీలేదులే...' అబద్ధమాడాను.

'సరేగానీ చిట్టెమ్మా... నీకో నిజం తెలుసా?... నువ్వు చచ్చిపోయిన మావోడి కడుపున పుట్టిన దానివి కావే కాదు. పిల్లల్లేక పోవటాన అనాధవైన నిన్ను పసితనంలోనే తెచ్చుకుని సాకారు!'

పెద్దావిడ మాట విని ఉలిక్కిపడ్డాను! నెత్తిన పిడుగు పడ్డట్టన్పించింది! బిక్క చచ్చిపోయాను. ఆవిడ చెప్పింది నిజమా? నేను సొంత బిడ్డనుకానా?- ఈ నిజం అమ్మానాయన నాతో చెప్పకుండా దాచారన్నమాట!... నాలో కలవరం మొదలైంది. ఏడుపుతన్నుకొస్తోంది.

'అంచేత చిట్టెమ్మా... ఇక మీదట నీ ఆటలు సాగనీయం!- అన్ని విషయాలు మేం చూచుకుందామనే వచ్చాం! ఇనపెట్టె బీగాలిటివ్వు... పొలం కాగితాలు... బంగారం... డబ్బు అంతామా పరం చెయ్యాలి... తెల్సిందా?-'

వామ్మో! ఇదేం ఉపద్రవం? చుట్టాలమంటూ వచ్చి ఇనపెట్టె తాళాలిమ్మంటున్నారేంటి? విస్తుపోయాను. ఆక్షణంలో ఏం చేయాలో దిక్కు తోచక పక్క వాటాలో వున్న ఆంటీ ఇంట్లోకి వేగంగా నడిచాను. జరిగినదంతా ఆంటీకి చెప్పాను.

'నువ్వేం అధైర్యపడకు చిట్టెమ్మ! నేనున్నాగా.. ఆళ్ల సంగతి నేను చూసుకుంటాగా!... నువెళ్లి వాళ్లు చెప్పేదంతా విను!' అన్చెప్పి ఆంటీ వీధిలోకి నడిచింది.

'యాడికే అటు ఇటూ తిరుగుతావ్? మామాటలు విన్నావా బతికిపోతావ్.. లేకపోతే ఈ రేత్రికే నీ బతుకు తెల్లారిపోద్ది...' హూంకరించాడు చిన్నాయన.

ఇంతలో పోలీసులను వెంట తీసుకుని పక్కింటి ఆంటీ రానే వచ్చింది.

పోలీసులను చూడగానే బంధువులంతా బెంబేలు పడటం గమనించాను. నిజమేనైతే చుట్టాలైతే వీళ్లెందుకు బెదిరిపోతారు? కాబట్టి... వీళ్లంతా నకిలీ బంధులే అయివుండాలి. తాను వంటరిగా వున్నానే విషయం తెల్సుకుని సర్వం దోచుకోవటానికి... లేకుంటే.. నన్ను చంపటానికైనా సిద్ధపడే వచ్చారన్నమాట!

'వీళ్లంతా చుట్టాలంటూ వచ్చి వంటరి చిట్టెమ్మను వంచించి ఆస్తి నగలు దబ్బు కాజేయాలని వచ్చిన దొంగలు ఎస్సైగారూ... బేడీలు వేసి వీళ్లని లాక్కెల్లి జైల్లో వేసి కుళ్ల బొడవండి. అప్పుడు నిజంవాళ్లే కక్కుతారు...' స్వరం పెంచి మాట్లాడింది ఆంటీ.

'చూడమ్మా!- వీళ్లు మీ బంధువులు కారని తెలియచేస్తూ కంప్లైంట్ రాసివ్వు. వీళ్ల సంగతి మేం తేలుస్తాం.. నువ్వూ మావెంట పోలీస్ స్టేషన్‌కిరా...'

ఎస్సై అనటంతో ఇంటికి తాళం పెట్టి బయల్దేరిన నాతో ఆంటీ కూడా ఫాలో అయింది.

బంధువలనబడే వాళ్లందరి చేతులకు బేడీలు వేసి జీపు ఎక్కించారు

బ్రతుకులో మరో అపశృతి దొర్లకుండా కాపాడిన ఆంటీకి ధన్యవాదాలు తెలిపాను.

(సమాప్తం)